226) రామక్రియ

ప॥ ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు నేసితి। తటుకున నీవనేవిధానము చేకొంటిని।

చ॥ కామించితి నాత్మ నిన్ను గలసి భోగించుటకు। వేమరు గ్రోధించితి నీవిరోధులపై।
నేమమున లోభించితి నీమంత్రమన్యుల కియ్య। ఆముకొని మోహించితి హరి నీరూపునకు॥

చ॥ యెఱుకతో మదించితి యిట్టే నీదాస్యమున। మఱి నిన్నొల్లనిచదువు మచ్చరించితి।
తఱి జలపట్టితి నీతప్పనిభక్తియందు। వెఱవక నిన్నొల్లనివిధుల నిందించితి॥

చ॥ కలకర్మములెల్లా నీకైంకర్యములందు వెట్టితి। బలుమమకారము నీపై జేర్చితి।
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి। నిలిచినకాలమెల్లా నీసేవే చేసితి॥